



EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
02 ఏప్రిల్ 2024
పేజీలు: 02




### ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..
## నలుగురి మృతి

ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి తుపాకుల మోత మోగింది. బీజాపూర్ జిల్లాలోని కొర్చోలి అటవీ ప్రాంతంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సలైట్లు మృతి చెందారు. పెద్ద సంఖ్యలో నక్సల్స్ గాయపడినట్లు సమాచారం. గంగులూరు పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనా స్థలం నుంచి ఇన్సాస్, ఎల్ ఎంజీ వంటి ఆటోమేటిక్ ఆయుధాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలంలో భద్రతా బలగాలు, పోలీసుల గాలింపు చర్యలు కొన సాగుతున్నాయి. వారం రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే.

### ఆటోను ఢీకొట్టిన డంపర్..
## ఐదుగురు దుర్మరణం

ఉత్తరప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదురుగు మరణించగా పలువురు గాయపడ్డారు. మంగళవారం ఉదయం ఝాన్సీ-మీర్జాపూర్ జాతీయరహదారిపై వేగంగా దూసుకొచ్చిన డంపర్ కొత్వాలి ప్రాంతంలోని అమన్‌పూర్ ప్రాంతంలో ఓ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.గాయపడిన వారిని జిల్లా దవాఖానకు తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాద సమయంలో ఆటోలో ఎనిమిది మంది ప్రయాణిస్తున్నారని వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# మేమంతా సిద్ధం బస్సు యాత్ర

మేమంతా సిద్ధం పేరుతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర ఆరో రోజుకు చేరుకుంది.. సత్యసాయి జిల్లా నుంచి అన్నమయ్య జిల్లాలోకి ప్రవే శించింది మేమంతా సిద్ధం యాత్ర.. ఈ రోజు ఉదయం 9 గంటలకు అన్నమయ్య జిల్లా చీకటి మానుపల్లెలోని విడిది కేంద్రం నుంచి బస్సు యాత్ర ప్రారంభం కానుంది.. మొలకల చెరువు, పెద్దపాల్యం, వేపురి కోట మీదుగా బుర్రకాయల కోట క్రాస్, గొల్లపల్లి మీదుగా అంగళ్లకు చేరు కోనుంది బస్సు యాత్ర.. ఇక, సాయంత్రం 3.30 గంటలకు మదనపల్లెలోని టిప్పు సుల్తాన్ గ్రౌండ్ లో మేమంతా సిద్ధం బహిరంగ సభ నిర్వహించనుంది వైసీపీ.. ఈ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు సీఎం వైఎస్ జగన్.. సభ అనంతరం నిమ్మనపల్లి క్రాస్, బోయకొండ క్రాస్, చౌడేపల్లి, సోమల మీదుగా పుంగనూరు నియోజకవర్గం అమ్మగా రిపల్లె చేరుకోనున్నారు.. అమ్మగారిపల్లె శివారులో ఏర్పాటు చేసిన విడిది కేంద్రం దగ్గర రాత్రి బస చేయనున్నారు సీఎం వైఎస్ జగన్. కాగా, మేమంతా సిద్ధం బస్సు యాత్రకు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు ప్రజలు.. బస్సు యాత్ర ఐదో రోజు విజ యవంతంగా కొనసాగింది. కిలోమీటర్ల కొద్దీ జనం మండే ఎండలను సైతం లెక్కచేయకుండా ఇరు వైపులా బారులు తీరి స్వాగతం పలికారు. శ్రీస త్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం సంజీవపు రంలోని బస కేంద్రం నుంచి ఉదయం 10.30 గంటలకు బస్సు యాత్ర ప్రారంభించారు. బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ మధ్య రామాపురం, కట్టకిం దపల్లి, రాళ్ల అనంతపురం సహా పలు గ్రామాల ప్రజలు జాతీయ రహదారిపైకి చేరుకుని సీఎంకు ఘన స్వాగతం పలికారు. రామాపురంలో బస్సు దిగి సీఎం జగన్ ప్రజలను ఆప్యాయంగా పలక రించారు. ముదిగుబ్బకు చేరుకునేలోపే ప్రజలు పెద్ద ఎత్తున రోడ్డుపై బారులు తీరారు. నాగారెడ్డిపల్లి గ్రామస్తులు భారీ గజమాలతో సీఎంకు స్వాగతం పలికారు. ఇక, శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు స్వాగతం పలికారు. బస్సుపై నుంచి రోడ్‌షో నిర్వహించిన సీఎం జగన్.. పీవీఆర్ కళ్యాణ మండపంలో ముస్లిం సోదరులతో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.







### జాతీయ అవార్డ్ గ్రహీత 'దాసి' సుదర్శన్ కన్నుమూత

టాలీవుడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. తెలుగు ఇండస్ట్రీ నుంచి 1988లో 'దాసి' సినిమాకు ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా జాతీయ అవార్డు దక్కించుకున్న దాసి సుదర్శన్ (73) మరణించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన సుదర్శన్ వృత్తిరీత్యా నాగార్జున్‌సాగర్‌లోని హిల్ కాల నీలోని ప్రభుత్వ కళాశాలలో డ్రాయింగ్ టీచర్‌గా జర్నీని ప్రారంభించారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సోమవారం కన్నుమూశారు. సుదర్శన్ అంత్యక్రియలు ఈవాళ మిర్యాల గూడలో నిర్వహించనున్నారు.



### సాగర్ నీళ్లు ఇవ్వండి..
## ఏపీ విజ్ఞప్తి

గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని ప్రజల తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడి కాల్వకు నీరు విడుదల చేయాలని KRMBని ప్రభుత్వం కోరింది. ఈ నెల 8 నుంచి రోజుకు 5500 క్యూసెక్కుల చొప్పున 5 టీఎంసీలు విడుదల చేయాలని కోరింది. గత అక్టోబర్లో అంగీక రించిన మేరకు నీటిని విడుదల చేయాలని గుర్తు చేసింది. అటు కేటాయించిన దాని కంటే తెలంగాణ 7.391 TMCల నీటిని అధికంగా వాడుకుందని, ఇకపై నియంత్రిం చాలని కోరింది.

### ఖురాన్‌ను తగులబెట్టిన
## వ్యక్తి మృతి

ముస్లిములు ఎంతో పవిత్రంగా భావించే ఖురాన్‌ను అనేకసార్లు తగులబెట్టిన ఇరాక్‌కు చెందిన సల్వాన్ మోమికా నార్వేలో శవమై కనిపించినట్లు మంగ ళవారం నివేదికలు వెల్లడించాయి. మోమికా ఇటీవలే స్వీడన్‌ను విడిచిపెట్టి నార్వేలో ఆశ్రయం పొందుతున్నాడు. దీనిపై మోమికా ఇటీవల ఒక ట్వీట్ చేశాడు. స్వీడిష్ అధికారులు తనను వేధిం చినట్లు అందులో పేర్కొన్నాడు. అయితే ఇస్లామిక్ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడుతానని తెలిపాడు.



## ప్రారంభమైన బండి సంజయ్ రైతు దీక్ష



బీజేపీ ఎంపీ బండిసంజయ్ రైతు దీక్ష ప్రారంభమైంది. ఇవాళ ఉదయం కరీం నగర్ జిల్లాలోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ దీక్ష చేపట్టారు. ఉదయం నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు రైతు దీక్ష సాగనుంది. ఈ దీక్షలో బండి సంజయ్ కుమార్ సహా పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు. అయితే రైతులకోసం చేపట్టిన రైతు దీక్షకు అందరూ మద్దతు తెలపాలని పిలు పునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యంవల్ల సాగు నీరందక పంటలు ఎండిపోతున్నా పట్టించుకోకపోవడం... పంటల బీమా పథకాన్ని అమలు చేయక పోవడం ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో రైతులకిచ్చిన ఏ ఒక్క హామీలని ఇప్పటి వరకు అమలు చేయని నేపథ్యంలో రైతు దీక్ష పేరుతో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు సిద్ధ మయ్యారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకిచ్చిన హామీల అమలుతోపాటు యుద్ధ ప్రాతి పదికన నష్ట పరిహారం అందజేయాలని, వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలనే ప్రధాన డిమాండ్లతో ఉద్యమ సైరన్ ను మోగించారు బండి సంజయ్. దీంతోపాటు ఏప్రిల్ తొలి వారం నుండి వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు పండించిన ప్రతి వడ్ల గింజను ప్రభుత్వం కొనుగోలు చేయించడంతోపాటు తాలు, తేమ పేరుతో వడ్ల తరుగు లేకుండా రైతుల నుండి పూర్తిస్థాయిలో వడ్లు కొనుగోలు చేయిం చడమే లక్ష్యంగా బండి సంజయ్ కుమార్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. వడ్ల కల్లాల వద్ద రైతులు పడుతున్న బాధలను, తాలు, తేమ, తరుగు పేరుతో రైతులు ఏ విధంగా నష్టపోతు న్నారనే విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేసేందుకు అవసరమైతే వడ్ల కల్లాల దగ్గర బండి సంజయ్ బస చేయాలని యోచిస్తున్నట్లు పార్టీవర్గాలు వెల్లడించారు.

## నష్టాల్లో స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాలతో ప్రారంభ మయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు మన సూచీలను ప్రభావితం చేస్తున్నాయి. ఉదయం 9:20 గంటల సమయంలో సెన్సెక్స్ 145 పాయింట్లు నష్టపోయి 73,868 వద్ద ట్రేడ వుతోంది. నిఫ్టీ 24 పాయింట్లు కుంగి 22,437 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.37 వద్ద ప్రారం భమైంది. సెన్సెక్స్-30 సూచీలో ఎన్‌టీపీసీ, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్, నెస్లే ఇండియా, టాటా మోటార్స్, పవర్‌గ్రిడ్, ఎల్ అండ్ టీ, టైటన్, టాటా స్టీల్, హెచ్‌యూఎల్ షేర్లు లాభాల్లో ట్రేడవు తున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్, విప్రో, టీసీఎస్, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.






# నాగచైతన్యతో పూజా హెగ్డే?

యువ నటుడు అక్కినేని నాగచైతన్య తాజాగా చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ మూవీ తండేల్ లో నటి స్తున్నారు. ఈ మూవీలో సాయి పల్లవి హీరోయిన్ గా నటిస్తుండగా గీతా ఆర్ట్స్ బ్యానర్ పై బన్నీ వాసు నిర్మిస్తున్నారు. త్వరలో రిలీజ్ కి రెడీ అవుతున్న ఈ మూవీ అనంతరం ఇటీవల విరూపాక్ష మూవీతో మంచి విజయం అందుకున్న కార్తీక్ దండు తో నాగచైతన్య తన నెక్స్ట్ మూవీ చేయనున్నట్లు తెలుస్తోంది. డిఫరెంట్ కాన్సెప్ట్ తో ఆకట్టుకునే కథ, కథనాలతో రూపొందనున్న ఈ మూవీ యొక్క అఫీ షియల్ అనౌన్స్ మెంట్ త్వరలో రానుండగా ఇందులో నాగచైతన్యకి జోడీగా పూజా హెగ్డే నటించనున్నట్లు లేటెస్ట్ టాలీవుడ్ బజ్. గతంలో వీరిద్దరూ కలిసి ఒక లైలా కోసం మూవీలో నటించారు. విజయ్ కుమార్ కొండా తెరకెక్కించిన ఆ మూవీ అప్పట్లో విజయం అందుకుంది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



బీఆర్ఎస్ పార్టీని వీడటం

# బాధగానే ఉంది

## కడియం శ్రీహరి

బీఆర్ఎస్ పార్టీని వీడటం కొంత బాధగానే ఉందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కేసీఆర్ పట్ల తనకు గౌరవం ఉంది, ఆయనపై ఏ రకమైన విమర్శలు చేయదలచుకోలేదని చెప్పారు. పార్టీ తనకు అవకాశాలు ఇచ్చింది, తాను వాటిని సద్వినియోగం చేసుకున్నానని తెలిపారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఉన్న తన నివాసంలో కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడారు. బీజేపీ ఇతర పార్టీల ప్రభుత్వాలను కూలుస్తున్నదని, అందుకే తాను కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. ప్రతిపక్ష పార్టీలను బీజేపీ వేధిస్తున్నదని విమర్శించారు. ఇతర ఎమ్మెల్యేల మీద, ప్రతిపక్ష పార్టీల నాయకుల ఈడీ, సీబీఐ కేసులు పెట్టి ప్రభుత్వాలను కూలగొట్టి అధికారం చలాయించాలని చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతానికి కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి ఢోకా లేదు. తాను ఈ రోజే కాంగ్రెస్‌లోకి వచ్చానని, అందువల్ల పార్టీలోని షిండేల గురించి తనకు తెలియదన్నారు.

మియాపూర్ మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలో

# భారీ అగ్నిప్రమాదం

మియాపూర్ మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మెట్రో స్టేషన్ డిపో సమీపంలోని చెత్త డంపింగ్ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగిసిపడుతుండటంతో అప్రమత్తమైన స్థానికులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసింది. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పొగ కాల్చడం వల్లే మంటలు చెలరేగి ఉండొచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు.



# వాట్సాప్‌లో

# భారీగా క్రికెట్ బెట్టింగ్

ఐపీఎల్ సీజన్ బెట్టింగ్ నిర్వాహకుల జేబులు నింపుతుండగా పందెంలో సొమ్ము కోల్పోయిన వారు రోడ్డున పడుతున్నారు. ఓవైపు మ్యాచ్‌లు జరుగుతుండగా రహస్య స్థలాల్లో దందా సాగిస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులను అవలంభిస్తూ పోలీసులకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలో పెద్దఎత్తున బెట్టింగ్ సాగుతోందని సమాచారం. ఎక్కువగా వాట్సాప్‌పై ఆధారపడుతున్నారని తెలిసింది.

### యువకులకు వల

బెట్టింగ్ నిర్వాహకులు యువకులకు పెద్ద మొత్తం ఆశ చూపి పందెం కాసేలా చేస్తున్నారు. ఓడిపోతే ఆస్తులు వారి పేరిట రాయించుకుంటున్నారు. ఇతర జిల్లాలకు చెందిన కొందరు బుకీలు ఈ ప్రాంతానికి చెందిన నిర్వాహకులతో చేతులు కలిపి కొందరితో ఆడిస్తున్నారు. పాత బుకీలపై పోలీసు నిఘా ఉండటంతో కొత్తవారిని రంగంలోకి దించుతున్నారు. పోలీసులు పాత బుకీలపై నిఘా పెట్టడానికే పరిమితమవుతుండటంతో కొత్త వ్యక్తుల పని సులభమవుతోంది. ఇదే అదునుగా బెట్టింగ్‌రాయుళ్లు కేంద్రాలు ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా తంతు నడుపుతున్నారు.

### కోడ్ భాషలో లావాదేవీలు

బెట్టింగ్ నిర్వాహకులు కోడ్ భాషను ఉపయోగిస్తూ ఆట నిర్వహిస్తున్నారు. ఉదాహరణకు 'ఆరు రూపాయలకు 10 టాబ్‌లెట్స్ లెక్క ఇస్తాను..అంతకంటే తగ్గదు' అంటే ఒక ఓవరుకు 10 పరుగులు చేస్తారని అర్థం. పందేలు కాసే వారు బుకీల వద్ద రిజిస్టర్ అయిన నంబరు నుంచి ఫోన్ చేస్తేనే మాట్లాడతారు. అనుమానం వస్తే ఆ నంబరు మార్చేస్తారు. కొత్త నంబరును ఎప్పుడూ వారితో బెట్టింగ్ ఆడే వారికి మాత్రమే ఇస్తారు. నగదు లావాదేవీలన్నీ మధ్యవర్తుల ద్వారానే నడుపుతారు. బెట్టింగ్ ఆడుతున్న సమయంలో ప్రత్యేక భాషను వినియోగిస్తారు. గెలిచే అవకాశం ఉన్న జట్టుపై బెట్టింగ్ కాస్తే ఈటింగ్, తక్కువ విజయావకాశాలున్న జట్టును ప్లేయింగ్ అంటారు.

### తనిఖీలేవీ..?

బెట్టింగ్‌లపై ముందస్తు సమాచారం లేకపోవడంతో పోలీసులు పూర్తి స్థాయిలో వివరాలు ఆరా తీయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో బెట్టింగ్‌రాయుళ్లు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. గతంలో కంటే జిల్లాలో అధికంగా బెట్టింగ్ సాగుతున్నా పోలీసులు తెలియనట్లు మిన్నకుండిపోతున్నారు. గతంలో మ్యాచ్ జరుగుతుండగా పలుచోట్ల తనిఖీలు చేసేవారు. అనుమానస్పదంగా ఉండే వారిని ప్రశ్నించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

మ్యాచ్ జరుగుతున్న సమయంలో బెట్టింగ్‌లు భారీగానే జరుగుతుంటాయి. ఆట ప్రారంభమైనప్పటి నుంచి చివరి బంతి వరకు పందెం కాస్తున్నారు.




నేను ఇంకా

# బాగా ఆడాల్సింది

## ముంబయి ఓటమిపై హార్దిక్

ఐపీఎల్ 17వ సీజన్‌లో ముంబయి రాత ఇంకా మారలేదు. సోమవారం రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో మరోసారి ఘోర పరాభవాన్ని చవిచూసిన ఆ జట్టు.. హ్యాట్రిక్ ఓటమిని ఖాతాలో వేసుకుంది. మ్యాచ్ అనంతరం దీనిపై కెప్టెన్ హార్దిక్ పాండ్య మాట్లాడుతూ.. తమ జట్టు మరింత క్రమశిక్షణతో, ధైర్యంగా ఆడాల్సిందని అన్నాడు. "మేం కోరుకున్న విధంగా ఆరంభం దక్కలేదు. ఇది కఠినమైన రాత్రి. ఫలితాలు అన్నిసార్లు అనుకున్నట్లు ఉండవు. వ్యక్తిగతంగా ఇక నా నుంచి ఆశ్చర్యకర ప్రదర్శన ఉంటుందని నేను భావించట్లేదు. కానీ, ఓ జట్టుగా రాణించగలమనే నమ్మకం ఉంది. అయితే, దాని కోసం మేం క్రమశిక్షణతో ఆడాల్సి ఉంటుంది. మరింత ధైర్యం ప్రదర్శించాలి" అని పాండ్య తెలిపాడు. "ఒక దశలో మేం 150 లేదా 160 పరుగులు చేసే స్థితిలో ఉన్నాం. కానీ, నా వికెట్ కోల్పోయిన తర్వాత మ్యాచ్ పరిస్థితి మారిపోయింది. నేను మరింత బాగా ఆడాల్సింది. ఈ ఫలితాన్ని ఊహించలేదు" అని ముంబయి కెప్టెన్ అన్నాడు. అనంతరం రాజస్థాన్ కెప్టెన్ సంజూ శాంసన్ మాట్లాడుతూ.. మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించడంలో టాస్ కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డాడు. గత రాత్రి జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబయి.. ఆదిలోనే తడబడింది.



సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పిన

# బాబా రాందేవ్

పతంజలి ఉత్పత్తుల గురించి తప్పుడు యాడ్స్ ఇచ్చిన కేసులో యోగా గురువు బాబా రాందేవ్ ఇవాళ సుప్రీంకోర్టు ముందు క్షమాపణలు చెప్పారు. ఆ కేసులో ప్రత్యక్షంగా ఇవాళ ఆయన కోర్టుకు హాజరయ్యారు. రాందేవ్, బాలకృష్ణలు వ్యక్తిగతం హాజరు కావాలని కోర్టు ఆదేశించిందని, ఆ ఆదేశాల ప్రకారం ఆ ఇద్దరూ కోర్టుకు వచ్చినట్లు వాళ్ల తరపు న్యాయవాది వెల్లడించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దాఖలు చేసిన కేసులో రాందేవ్ బాబా క్షమాపణలు తెలిపారు. పతంజలి సంస్థ ఉత్పత్తులకు గురించి మెడికల్ యాడ్స్ ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఈ కేసులో గతంలో పతంజలి ఎండీ ఆచార్య బాలకృష్ణ ప్రత్యక్షంగా కోర్టుకు క్షమాపణలు చెప్పారు. జస్టిస్ హిమా కోహ్లీ, అషానుద్దిన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. వారం రోజుల్లోగా మెడికల్ యాడ్స్ కేసులో కొత్త అఫిడవిట్ దాఖలు చేయాలని బాబా రాందేవ్, బాలకృష్ణకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది.

# కాంగ్రెస్ సర్కార్ అలసత్వంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు

## సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు




కేసీఆర్ పొలంబాట పట్టిన తర్వాతే ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు ప్రారంభించిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నిన్న గాయత్రి పంప్ హౌస్ నుంచి వరద కాలువకు నీళ్లు విడుదల చేశారని, కేసీఆర్ వెళ్లడంతో సాగర్ ఎడమ కాలువకు నీళ్లు వదిలారని చెప్పారు. ఇప్పుడు కరీంనగర్ వస్తున్నారని ఎస్సారెస్పీ కాలువకు నీళ్లిచ్చారని తెలిపారు. రైతులను ఆదుకోవాలని, ధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ హామీలు అమలు చేయాలని కోరుతూ సిద్దిపేట కలెక్టర్‌కు హరీశ్ రావు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. నీరు, విద్యుత్ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్ల లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని చెప్పారు. సర్కార్ అలసత్వం వల్ల రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. నీళ్లున్నా రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడతామని చెప్పారు.

## ఓటు వేసే ముందు

# ఇది తెలుసుకోండి

దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం అధికారులు ఓటర్లను చైతన్య పరుస్తున్నారు. పోటీలో నిలబడిన అభ్యర్థుల నేర చరిత్ర గురించి తెలుసుకోవడం ఓటరు బాధ్యత అని ఈసీ సూచించింది. కేవైసి యాప్ ద్వారా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నేర పూర్వాపరాల గురించి తెలుసుకోవాలని కోరింది. అభ్యర్థుల అఫిడవిట్‌లను డౌన్‌లోడ్ చేసుకొని చదువుకోవాలని పేర్కొంది.



# బీజేపీలో చేరకపోతే నన్నుఅరెస్ట్ చేస్తారంట

## ఢిల్లీ మంత్రి అతిషి

ఢిల్లీ మంత్రి అతిషీ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో చేరాలని సన్నిహితుల ద్వారా బీజేపీ తనను సంప్రదించిందన్నారు. దానికి తాను నిరాకరించానని చెప్పారు. బీజేపీలో చేరకపోతే మరో నెలలో తనను ఈడీ అరెస్టు చేస్తుందని చెప్పారు. సీఎం కేజ్రీవాల్ జైలులో ఉన్నప్పటికీ.. ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటికీ యూనిటీగా, బలంగా ఉందన్నారు. అయితే బీజేపీ నేతలు ఆమ్ ఆద్మీ పార్టీ తదుపరి నాయకత్వాన్ని జైలులో పెట్టాలని యోచిస్తున్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల లోపు మరో 4 మంది AAP నాయకులను అరెస్టు చేస్తారని తెలిపారు. - సౌరభ్ భరద్వాజ్, అతిషి, దుర్గేష్ పాఠక్, రాఘవ్ చద్దాలను ఈడీ అరెస్ట్ చేస్తుందని ఆరోపించారు.



# హీట్ పెంచేస్తున్న ప్రగ్యా జైస్వాల్

కంచె బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ అందాలు ఆరబోసినప్పటికీ అవకాశాలు రావడం లేదు. తాజాగా ఈ బ్యూటీ మరోసారి హాట్ బాంబ్ పేల్చింది. ఇన్ స్టాలో షేర్ చేసిన ఈ ఫోటోల్లో ప్రగ్యా గోల్డెన్ డ్రెస్ లో మెరిసిపోతుంది. ఈ అమ్మడు అందాలకు కుర్రాళ్లు బౌల్డ్ అవుతున్నారు. ఇన్ స్టాలో షేర్ చేసిన ఈ ఫోటోల్లో ప్రగ్యా గోల్డెన్ డ్రెస్ లో మెరిసిపోతుంది. ఈ అమ్మడు అందాలకు కుర్రాళ్లు బౌల్డ్ అవుతున్నారు. ఇన్‌స్టాలో షేర్ చేసిన ఈ ఫోటోల్లో ప్రగ్యా గోల్డెన్ డ్రెస్ లో మెరిసిపోతుంది. ఈ అమ్మడు అందాలకు కుర్రాళ్లు బౌల్డ్ అవుతున్నారు. ఇన్ స్టాలో షేర్ చేసిన ఈ ఫోటోల్లో ప్రగ్యా గోల్డెన్ డ్రెస్ లో మెరిసిపోతుంది. ఈ అమ్మడు అందాలకు కుర్రాళ్లు బౌల్డ్ అవుతున్నారు.